అంబేద్కర్ స్ఫూర్తితో పరిపాలన

- తెలంగాణ పునఃనిర్మాణంపై మరుగుజ్జులు ప్రేలాపాలు
- ప్రతిపక్షాలపై సిఎం కెసిఆర్ ఘాటు వ్యాఖ్యలు
- వైభవంగా సచివాలయం ప్రారంభోత్సవం
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ దస్త్రంపై సిఎం సంతకం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్ర పున్ణనిర్మాణంపై ప్రతిపక్షాలు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయాన్ని సిఎం ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె శాంతికుమారి, రాష్ట్ర మంత్రులు, డిజిపి అంజనీకుమార్, ఇతరులూ వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా సిఎం ప్రసంగించారు. 'తెలంగాణ అవతరణకు ముందు అనేక వాదోపవాదాలు, అనేక చర్చలు చూశాం. తెలంగాణ అవతరించిన తర్వాత కూడా పున్ణనిర్మాణం కోసం అంకితభావంతో అడుగులు వేసే సందర్భంలో తెలంగాణ భావాన్ని, అర్థాన్ని, పున్ణనిర్మాణ కాంక్షను జీర్ణించుకోలేని పిచ్చివాళ్లు కొందరు అర్భకులు కారుకూతలు కూశారు. కొన్ని పిచ్చివాంతులూ చేసుకున్నారు. "తెలంగాణ రాష్ట్ర పున్ణనిర్మాణమంటే ఏంటీ? ఉన్నయన్నీ కూలగొట్టి మళ్లీ కడతారా?" మొత్తం తెలంగాణనే కూలగొట్టి మల్ల కడతారా ? అంటూ చిల్లర వ్యాఖ్యలు చేశారు. వాటిని పట్టించుకోకుండా ఈ రోజు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయింది నా తెలంగాణ అని గర్వంగా ప్రకటిస్తున్నా' అని అన్నారు. తెలంగాణ పరిపాలనకు గుండెకాయగా, అత్యంత శోభాయమానంగా నిర్మించిన సచివాలయం తప చేతుల మీదుగా ప్రారంభించడం తప జీవితంలో దొరికిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సచివాలయ నిర్మాణంలో అందరి కృషి ఉందని వెల్లడించారు. సచివాలయ తరహాలోనే తెలంగాణ పల్లెలూ వెలిగిపోతున్నాయని అన్నారు.

మండు వేసవిలో మత్తడి దుంకే చెరువులే ...

"పున్ణనిర్మాణం అంటే ఏంటో తెలియని మరుగుజ్జులకు నాలుగు మాటలు చెప్పదలచుకున్న. పున్ణనిర్మాణం అంటే నాడు సమైక్య పాలనలో శిథిలమైపోయి రంధ్రాలతో మొత్తం వచ్చిన నీటినీ కోల్పోయి అద్భుతమైన కాకతీయులకాలంలో చిక్కిశల్యమైపోయిన నిర్మాణమై చెరువులన్నింటిని పునరుద్ధరించి ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకేలా చేయడం, అనేక ఉపనదులు తెలంగాణలో ఉన్నాయి. జీవనదులూ ఉన్నాయి. కానీ, నాటి సమైక్య రాష్ట్రంలో దుస్థితి ఏంటంటే గోదావరిలో డబ్బులు, రాగి నాణేలు వేద్దామంటే నీళ్లు ఎక్కడున్నాయో వెతుక్కోవాల్సిన పరిస్థితి. రామగుండం వద్ద బిడ్జి మీద నుంచి నడిచి ఎక్కడైనా చిన్నపాటి గుంతలో నీళ్లు కనిపిస్తే వేసేది. ఈ రోజు రామగుండానికి వెళ్తే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్టిఇరిగేషన్ నిర్మాణం జరిగింది. ఈ ప్రాజెక్టు శిఖరాయమానంగా ప్రపంచానికే తలమానికంగా వెలిసింది. ఇదీ పునర్నిర్మాణం. వాగుల మీద నిర్మించిన చెక్‌డ్యామ్‌లూ గోదావరి, కృష్ణ, మంజీర, మానేరు, హల్దీ, కూడవెల్లి తదితర ఉప నదులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ఏప్రిల్, మేలోనూ మత్తడి దుంకడమే.. తెలంగాణ పున్ణనిర్మాణానికి భాష్యం' అన్నారు.

పున్ణనిర్మాణం అంటే ఒక కాళేశ్వరం..

'ఆ నాడు నెర్రలుబారి నోళ్లువెల్లబెట్టిన లక్షలాది ఎకరాల తెలంగాణ బీడు భూములు నేడు నిండు నీటిపారుదలకు నోచుకొని పంట పొలాలై వెదజల్లుతున్న హరితక్రాంత్రే తెలంగాణ పున:నిర్మాణం. ఒక మాట గర్వంగా చెప్పాలి. ఈ యాసంగి పంటలో భారతదేశంలో ఉన్న వరి పైరు 94లక్షల ఎకరాలు. ఇందులో 56లక్షల ఎకరాలు తెలంగాణలో పంట పండుతోందని నేను సగర్వంగా చెబుతున్నా. పున్ణనిర్మాణం అంటే ఒక కాళేశ్వరం... ఒక పాలమూరు ఎత్తిపోతల పథకం... ఒక సీతారామా ప్రాజెక్టు అని మనవి చేస్తున్నా. అర్ధరాత్రి కరెంటు పోయి.. ఎప్పుడు వస్తుందో తెలియక, పారిశ్రామికవేత్తల ధర్నాలు, ప్రజల గగ్గోలు, జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లతో ఉన్న రాష్ట్రంలో నేడు అవన్నీ మాయమై జాజ్వల్యమానమైన కరెంటు వెలుగులతో విరాజిల్లుతోంది తెలంగాణ. ఇదీ పున్ణనిర్మాణం అంటే. అర్ధరాత్రి కరెంటు పెట్టేందుకు వెళ్లి పొలాల దగ్గర కరెంటు షాకులతో నాడు పాములు తేళ్లకాట్లతో చనిపోయిన రైతులు నేడు దినం పూటనే సాయంత్రం ఆరు గంటల వరకు పొలాలను పారించుకొని దర్జాగా ఇంటికి వచ్చి కంటినిండా నిద్రపోతున్నారు. ఈ తెలంగాణ రైతుల దర్పమే తెలంగాణ పున్ణనిర్మాణమని తెలియజేస్తున్నా' అని కెసిఆర్ అన్నారు.

వెంటనే ఉత్తర్వులు జారీ

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ దస్త్రంపై సిఎం సంతకం చేసిన నిమిషాల వ్యవధిలోనే రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లోని 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు (ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య, ఆరోగ్య శాఖలో 837 మంది వైద్య సహాయకులు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులతోపాటు ఇతర శాఖల్లోని పలువురిని క్రమబద్ధీకరిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మిషన్ భగీరథ ప్రతీక

'గ్రామాలు, పట్టణాలు ఎంత అద్భుతంగా అలరాలుతున్నాయో, ఎన్ని అవార్డులు సొంతం చేసుకుంటున్నాయో మీ అందరికీ తెలుసు. క్షీణించిపోయి, పత్తాలేకుండాపోయి అగమైనపోయిన అడవులు నేడు హరితశోభను వెదజల్లుతున్నాయి. ఒకనాడు దాహంతో అల్లాడి, ఫ్లోరైడ్‌తో నడుం వంగి లక్షలాది మంది జీవితాలు కోల్పోయిన, కుమిలిపోయిన తెలంగాణలో మిషన్ భగరీథలో ఇంటింటికీ నీరందిస్తున్నాం. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఏ నీళ్లు ఉంటయో.. ఆదిలాబాద్ గోండుగూడెంలో అదే నీరందిస్తున్న మిషన్ భగరీథ తెలంగాణ పున్ణనిర్మాణానికి ప్రతీక' అని కెసిఆర్ స్పష్టం చేశారు.

అంతర్జాతీయ నగరాలకు దీటుగా తెలంగాణ

'అంతర్జాతీయ నగరాలకు దీటుగా తెలంగాణ రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణలో మత కల్లోలాలు లేవు. సమ్మిళిత అభివద్ధితో ముందుకు పోతున్నాం. పారిశ్రామిక రంగంలో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఐటీ విధానంలో బెంగళూరును దాటిపోతున్నాం.మురికి కూపాలుగా ఉన్న పట్టణాలను అభివద్ధి చేస్తున్నాం. పచ్చదనం, డంపుయార్డులతో, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లతో పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. అంతర్జాతీయ నగరాలకు ధీటుగా అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, లింక్ రోడ్లతో హైదరాబాద్ అభివద్ధి చెందుతున్నది. ప్రపంచంలో అభివద్ధిని, పున:నిర్మాణానికి కొలమానంగా తీసుకునే సూచికలు రెండే రెండు ఒకటి తలసరి ఆదాయం. రెండోది తలసరి విద్యుత్ వినియోగం. ఇవి నిజమైన అభివద్ధి సంకేతాలు. తలసరిఆదాయంలో ముందున్నాం. విద్యుత్ వినియోగంలో 2,140 యూనిట్లతో దేశంలోనే అగ్రభాగాన ఉన్నాం. ఆసరా పెన్షన్లతో పేదల ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నాం. సచివాలయం నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి హదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను' అన్నారు.

సచివాలయంలో కొలువుదీరిన మంత్రులు..

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సచివాలయాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించారు. ఆరో అంతస్తులోని సిఎం కార్యాలయానికి వెళ్లి ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ సహా ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

తర్వాత మంత్రులు సంబంధిత ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. మంత్రి కెటిఆర్.. పేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన ఫైలుపై సంతకం చేయగా, మంత్రి హరీశ్ రావు రెండు దస్త్రాలపై సంతకం చేశారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న 19,800 మంది ఉపాధ్యాయులకు రూ.34.25 కోట్లతో ట్యాబ్‌లను, ఐదు వేల ప్రాథమిక పాఠశాలల్లో లైబ్రరీ కార్నర్‌లను రూ. 7.53 కోట్లతో ఏర్పాటు చేసే దస్త్రాలపై తొలి సంతకం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఫైల్‌పై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తొలి సంతకం చేశారు. పౌరసరఫరాల శాఖలో ఐసీడీఎస్ అంగన్వాడీలకు పోషకాల సన్నబియ్యం పంపిణీ ఫైలుపై, బిసి, ఎంబిసి కార్పోరేషన్ల ఆక్షన్ ప్లాన్ ఫైల్‌పై మంత్రి గంగుల కమలాకర్ తొలిసంతకం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాలోని వంద ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేస్తు ఫైల్ పై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తొలి సంతకం చేశారు. భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన దేవాలయాల్లో మిల్లెట్ ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే దస్త్రంపై ఆయన సంతకం చేశారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన ఛాంబర్‌లో ఆసీనులై పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.

సిఎంకు మంత్రుల శుభాకాంక్షలు ఆరు ఫైళ్లపై సంతకం

1. దళితబంధు పథకం 2023-24కు సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో అమలు చేసిన హుజూరాబాద్ మినహా రాష్ట్రంలోని 118 నియోజకవర్గాల్లో ప్రతి నియోజక వర్గానికి 1100 లబ్ధిదారుల చొప్పున దళిత బంధు పథకాన్ని వర్తింపచేయాలనే ఫైలుమీద, పోడుభూముల పట్టాల పంపిణీ కి, సిఎంఆర్ ఎఫ్ నిధులు లబ్ధిదారులకు సంబంధించి, గర్భిణులకు పౌష్టికాహారం కోసం అందించే...కెసిఆర్ న్యూట్రిషన్ కిట్‌కు సంబంధించి, రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి, పాలమూరు లిప్టు ఇరిగేషన్‌కు సంబంధించిన ఫైళ్ల మీద సిఎం సంతకం చేశారు.

తెలంగాణ మీడియాకు 'నో' ఎంట్రీ

కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి తెలంగాణ మీడియాకు పూర్తిస్థాయిలో ఆహ్వానాలు అందలేదు. దీంతో జర్నలిస్టు సంఘాలు నిరసన తెలిపాయి. మీడియా పట్ల వివక్ష చూపడాన్ని ఖండించాయి. స్థానిక మీడియాను పక్కనపెట్టడం సరికాదని టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు ఎం. అరుణ్‌కుమార్, బి. జగదీశ్వర్ వ్యాఖ్యానించారు. .

భోజనాల దగ్గర రసాభాస

ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసాక అందరూ భోజనాలు చేసి వెళ్లాలని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు. అయితే ఆమేరకు ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.



గ్రామస్తులు, పోలీసుల మధ్య తోపులాట జరుగుతున్న దృశ్యం

రగులుతున్న ఇథనాల్ చిచ్చు..

- పరిశ్రమ నిర్మించవద్దని స్తంభంపల్లి గ్రామస్తుల నిరసన
- అడ్డుకున్న పోలీసులు, తోపులాట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటయ్యే పరిసర గ్రామాల్లో రోజురోజుకూ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చిచ్చు రగులుతూనే ఉంది. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనను పోలీసులు అన్నివిధాల అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసుల ఒత్తిడి పెరిగినకొద్దీ ఆందోళన మరింత ఉధృతంగా మారుతోంది. కాగా, ఆదివారం తాజాగా స్తంభంపల్లిలో ఇథనాల్ మంటలు చెలరేగాయి. స్తంభపల్లి గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ వద్దంటే వద్దంటూ గ్రామస్తులు మైసమ్మతల్లికి బోనాలతో మొక్కులు చెల్లించేందుకు వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తోపులాట జరగగా గ్రామస్తులకు స్వల్పంగా గాయాలయ్యాయి. సిఐ కోటేశ్వర్, ఎస్ఐ నరేష్, నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినిపించుకోకుండా నెత్తిన బోనం ఎత్తుకుని వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. కాగా, స్తంభపల్లి గ్రామస్తులు మైసమ్మ బోనాలకు ఆహ్వానించగా పాల్గొనేందుకు వెళ్తున్న జగిత్యాల డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హరిత హోటల్ పక్కన పోలీసులు అడ్డుకొని ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామస్తులు అక్కడికి చేరుకొని పోలీసులతో వాదించారు. తమ గ్రామంలో బోనాలు పెట్టుకుని తాము పిలిస్తే వచ్చిన వారిని ఎలా అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా వ్యవరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



బాధ్యతలు స్వీకరించిన ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కోరం అశోక్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ నూతన సచివాలయం ప్రారంభోత్సం సందర్భంగా రెండవ అంతస్తులోని తన సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి కార్యాలయంలో మధ్యాహ్నాం 1.50 గంటలకు ఛార్జీ తీసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమీషనర్‌గా, రాష్ట్ర చలన చిత్ర అభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఎక్స్‌ఆఫిషియో కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డిని సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు జగన్, శ్రీనివాస్, కె.వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు మధుసూదన్, హష్మీ, .ఐఇ రాధాకిషన్, ఆర్‌ఐఇ జయరాంమూర్తి, ఎఫ్‌డిసి ఇడి కిషోర్‌బాబు తదితరులు అభినందించారు.



మహాసభలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

ఐక్యంగా పోరాడుదాం.. సమస్యలు పరిష్కరించుకుందాం..

- రజక వృత్తిదారుల సంఘం మహాసభలో పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐక్యంగా పోరాటాలు నిర్వహించి రజకుల సమస్యలు పరిష్కరించుకుందామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్, రాష్ట్ర నాయకులు ఎదునూరి మదర్, సుభద్ర, బాలకృష్ణ అధ్యక్ష వర్గంగా వహించారు. చివరి రోజైన ఆదివారం రజకుల సమస్యలపై 12 తీర్మానాలు ప్రవేశపెట్టగా, రాష్ట్ర మహాసభ ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. గీత, బీడీ కార్మికులకు ఇచ్చినట్టుగానే 50 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజకులకు రక్షణ చట్టాలు కల్పించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. రజక వృత్తిదారులకు రూ.పది లక్షల రుణాలు అందించాలని కోరారు. ఉచితంగా విద్యుత్ అందించి రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, లాండ్రీలు, పోలీసు, రైల్వే, విమానయాన విద్యా రంగ, దోబీ పోస్టులను రజకులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బిసి కులగణన చేపట్టి జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారస్సులు అమలు చేయాలన్నారు. పాలకుర్తిలో వీరనారి ఐలమ్మ స్మారక స్మృతి వనం కోసం ఆరు ఎకరాల భూమి కేటాయించాలని, అలాగే ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో మోడ్రన్ దోబీఘాట్లు, కమ్యూనిటీ భవనాలకు రెండు ఎకరాలు కేటాయించాలన్నారు. రైతులకు ఈనాం భూములకు పట్టాలివ్వాలని, చాకి రేవు స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం రజకులు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. మహాసభలో సంఘం నాయకులు ఎం వెంకటేశ్వర్లు, రాక్రే, ఏదునూరి మదర్, ఉల్లెంగుల వెంకటేశ్వర్లు, ఈదునూరి గట్టేశం, కొలిపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములు కాపాడాలి

- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి
- శ్రీ సత్య సాయి సొసైటీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల భూములపై కన్నేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకుని, ఆ భూములను కాపాడాలని శ్రీ సత్య సాయి సొసైటీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ మియాపూర్ పరిధిలోని హైదర్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 172/2 నుంచి 9, 18, 19 సుమారుగా 98 ఎకరాలు పట్టా భూమిని రైతుల నుంచి శ్రీ సత్యసాయి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కొనుగోలు చేసి 1100 మంది సభ్యులకు 1981-85 మధ్య కాలంలో విక్రయించారు. ఈ భూములపై కన్నేసిన భూ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని శ్రీ సత్య సాయి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పార్థసారధి మాట్లాడుతూ.. పేదల భూములను గమనించిన గోల్డ్ స్టోన్ ప్రసాద్ ఈ భూములపై కన్నేసి కాజేయాలని చూస్తున్నాడన్నారు. ఈ భూములను అసైన్‌మెంట్ భూములుగా తప్పుడు పత్రాలు సృష్టించి 1996లో జిల్లా కోర్టులో కేసు వేసినట్టు తెలిపారు. ఈ కేసుపై సొసైటీ హైకోర్టులో పోరాడగా ఈ స్థలమంతా రైతుల పట్టా భూమి అని, ఈ భూములు సొసైటీ సభ్యులకే చెందుతాయని 2019న హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ "గోల్డ్ స్టోన్ ప్రసాద్" సుప్రీం కోర్టును ఏడాది కింద ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు "స్టేటస్ ఖో" విధిస్తూ, విచారణ చేపట్టగా, 2.5.2023న తదుపరి విచారణ జరగనున్నదని తెలిపారు. దీన్ని గమనించిన కొంత మంది ఈ స్థలంలో రాత్రి సమయంలో కార్యకలాపాలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో సౌకర్యాల సందర్శన

- మెట్రో కార్యకలాపాలతో పాటు పలు అంశాలపై అధ్యయనం
- హెచ్ఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎయిర్ పోర్ట్ మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, ఆయన బృందం శనివారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో సౌకర్యాలు, కార్యకలాపాలను అధ్యయనం చేశారు. ఢిల్లీ విమానాశ్రయాన్ని న్యూఢిల్లీ రైల్వే, మెట్రో స్టేషన్‌లతో కలుపుతూ మొత్తం 23 కి.మీ లైన్ (16కి.మీ భూగర్భ, 7కి.మీ ఎలివేటెడ్)లో ఎనిమిది స్టేషన్లు ఉన్నాయి. గరిష్టంగా 95 కెఎంపిహెచ్ వేగంతో సగటున 65 కెఎంపిహెచ్ వేగంతో ఈ దూరాన్ని ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు 19 నిమిషాల్లో ప్రయాణాన్ని పూర్తి చేస్తోంది. తొలుత ఎన్‌విఎస్ రెడ్డి బృందాన్ని టీ-3 ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లో సీనియర్ డిఎంఆర్‌సి అధికారులు రిసీవ్ చేసుకుని ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో ఉన్న భూగర్భ మెట్రో స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు సిటీ మెట్రో స్టేషన్లలో చెక్-ఇన్ చేయబడి, విమానాశ్రయానికి బదిలీ చేయబడిన సామాను ఎయిర్‌పోర్టు వైపు బదిలీకి సంబంధించిన సౌకర్యాలను, ఇతర కార్యకలాపాలను ఎండీ తనిఖీ చేశారు. అనంతరం బృందం



ఎయిర్ పోర్టు మెట్రో సౌకర్యాలను తనిఖీ చేస్తున్న ఎన్‌విఎస్ రెడ్డి

మెట్రో రైలులో న్యూఢిల్లీ స్టేషన్‌కు ప్రయాణించారు. న్యూఢిల్లీ స్టేషన్‌లో చెక్ ఇన్ సౌకర్యాన్ని పరిశీలించారు. ఎయిర్‌లైన్స్ కౌంటర్ల నుంచి విమాన ప్రయాణికుల చెక్-ఇన్ బ్యాగ్‌లు రోలర్‌లపై ఉన్న కంటైనర్‌లోకి బదిలీ చేయబడతాయి. కంటైనర్లు సీలు చేయబడి, రోలర్లపై ఆటోమేటిక్‌గా మెట్రో కోచ్‌లోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోకి తరలిస్తారు. ప్రతి కంటైనర్‌పై ప్రత్యేకమైన ఆర్‌ఎఫ్‌ఐడీ ట్యాగ్ అతికించడం వల్ల సిటీ మెట్రో స్టేషన్ నుంచి విమానాశ్రయానికి కంటైనర్ల కదలిక స్కాడా సిస్టమ్ ద్వారా ట్రాక్ చేయబడుతుంది. ప్రయాణీకుల బ్యాగ్‌లు సురక్షితంగా, సమయానికి మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టుకు బదిలీ చేయబడతాయి. అక్కడ వీటిని సంబంధిత విమానాలకు తరలిస్తారు.

ఈ సిటీ చెక్-ఇన్ సౌకర్యాలు ప్రస్తుతం శివాజీ పార్క్ స్టేషన్, న్యూఢిల్లీ మెట్రో స్టేషన్లలో ఉన్నాయి. విమాన ప్రయాణీకులు తమ బ్యాగేజీని ఈ రెండు స్టేషన్లలో ఏదైన ఒకదానిలో వారి విమానం బయలుదేరే సమయానికి కనీసం రెండు గంటల ముందు చెక్ ఇన్ చేయాలి. చెక్-ఇన్ చేసిన తర్వాత, ప్రయాణికులు మెట్రో రైలులో సౌకర్యవంతంగా విమానాశ్రయానికి చేరుకుంటారు. ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న వివిధ పట్టణాలు, నగరాలకు హై స్పీడ్ రైలు కనెక్టివిటీని అభివృద్ధి చేస్తున్న రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కొనసాగుతున్న పనులతో పాటు ఎయిర్‌పోర్ట్ మెట్రో నిర్వహణ డిపో, ఇతర సౌకర్యాలనూ ఈ బృందం సందర్శించింది. డిపోలు, స్టేషన్ల లేఅవుట్లు, మెట్రో కోచ్‌ల నిర్వహణ సౌకర్యాలు, డిపోలు, స్టేషన్లలో ప్రాపర్టీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అధ్యయనం చేశారు. ఆ తర్వాత ఎన్‌విఎస్ రెడ్డి బృందం డిఎంఆర్‌సి ఎండి వికాస్ కుమార్, నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఎండి వికె సింగ్, వారి సీనియర్ ఇంజనీర్ల బృందాలతో పరస్పర అనుభవాలను పంచుకోవడానికి చర్చలు జరిపారు.

ఒయులో ముగిసిన 24వ జాతీయ విద్యా చలనచిత్రోత్సవాలు

- విజేతలకు ట్రోఫీలు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉత్సాహంగా సాగిన 24వ జాతీయ విద్యా చలనచిత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో విజేతలైన డాక్యుమెంటరీ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, సాంకేతిక నిపుణులకు ట్రోఫీలను అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఒయు రిజిస్ట్రార్ ప్రొ పప్పుల లక్ష్మీనారాయణ, గౌరవ అతిథిగా యుజిసి వ్యవహారాల డీన్ ప్రొ జి మల్లేశం హాజరయ్యారు. సిఇసి డైరెక్టర్ ప్రొ జెబి నడ్డా మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి డాక్యుమెంటరీ చిత్రోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఒయులో తొలిసారి ఇలాంటి కార్యక్రమం జరిగినా విజయవంతం చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యాసంబంధ కార్యక్రమాలు ఒయుకు కేటాయించాలని సిఇసి డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దృశ్య మాధ్యమానికి సమాజంలోని అన్ని అడ్డంకులను చేధించే సత్తా ఉందని, ఇంట్లో అమ్మ చేసే పని మీదా డాక్యుమెంటరీలు రావాలని యువ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు డిజిటల్ విద్య పాత్రను నొక్కి చెప్పారు. వాణిజ్య చలనచిత్ర ప్రపంచంలో అంతగా ప్రాచుర్యం పొందని విద్యా చిత్రాల నిర్మాతలను ప్రోత్సహించడానికి ఒక వేదికను అందించడంలో సిఇసి-యుజిసి ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ సినిమాలు గ్రామీణ ప్రాంతాలకు వరమని, సమాజంలోని చేరని ప్రాంతాలకు చేరువయ్యేందుకు అద్భుతమైన వాహనంగా నిలుస్తాయన్నారు. సిఇసి-యుజిసి డాక్యుమెంటరీ అవార్డుల పరిధిని విస్తరించాలని, విద్యార్థులు, అధ్యాపకులు చేసిన అధ్యయన వీడియోలను అవార్డుల కేటగిరీలో చేర్చాలని కోరారు. ఇందుకు సిఇసి డైరెక్టర్ ప్రొ.జేబీ నడ్డా సానుకూలంగా స్పందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయ విద్యాబోధనకు తోడు డిజిటల్ విద్యాబోధనా పద్ధతులను అధ్యాపకులు అలవర్చుకోవాలని ప్రొ నడ్డా సూచించారు. ఎడ్యుకేషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అద్భుత ఆదరణ లభించిందంటూ ఉస్మానియా పాలకవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఒయులో జాతీయ విద్యా చలన చిత్రోత్సవ నిర్వహణకు అవకాశం ఇచ్చిన సిఇసికి యుజిసి వ్యవహారాల డీన్ ప్రొ.జి మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు. కృత్రిమ మేధ, డిజిటల్ విప్లవం లాంటి ఎన్ని మార్పులు వచ్చినా ఉపాధ్యాయుడు ఎప్పటికీ సజీవంగానే ఉంటాడన్నారు. అయితే ఆధునిక విద్యావిధానాన్ని అందిపుచ్చుకోకపోతే కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. నెల్సన్ మండేలా సహా ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు విద్యా ప్రాముఖ్యత పట్ల ఎలాంటి శ్రద్ధ కనబరిచే వారో వివరించారు. కార్యక్రమంలో ఒయు విసి ప్రొ రవిందర్, రఘుపతి సహా బోధన, బోధనేతర సిబ్బంది, సంఘాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాసాబ్ ట్యాంక్ నుంచే నా రాజకీయ జీవితం ప్రారంభం

- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- డైమండ్ జూబ్లీ ఉత్సవాల పైలాన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాసాబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ నుంచే నా రాజకీయ జీవితం ప్రారంభమైందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కెసిఆర్ ప్రోత్సాహంతో ఈ కాలేజీలో చదువుకునేవాడినని చెప్పారు. ఆదివారం మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డైమండ్ జూబ్లీ స్మారక స్థూపం (పైలాన్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలేజీ భవనం పున:నిర్మాణం కోసం కృషిచేస్తానని అన్నారు. ఈ కాలేజీ కోసం ఇప్పటికే రూ.2 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. పూర్తిస్థాయిలో మరోసారి అంచనాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 12, 13 తేదీల్లో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వేగంగా కాలేజీ పున:నిర్మాణ పనులు సాగాలని కోరారు. ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ కోసం పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు సహకారం గొప్పదని అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మొదటి అడుగుగా పైలాన్ ఏర్పాటుకు భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిపిటి మా అధ్యక్షులు సురేశ్ ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి లల్లూ నాయక్, ఐఆర్ఎస్ అధికారి మురళీమనోహర్, బండి రమేశ్, పూర్వ విద్యార్థి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్‌కు బైబిల్ బహూకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సిఎం కెసిఆర్‌కు ఆదివారం తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ బైబిల్‌ను బహూకరించారు. ఛాంబర్లలో ఆసీనులైన మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వీటితోపాటు అంగన్‌వాడీలకు సన్న బియ్యం సరఫరా, మూడేండ్లలోపు పిల్లలకు ఉచితంగా పాల పంపిణీ ఫైలుపై నూతన చాంబర్‌లో తొలి సంతకం చేసిన రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కి రాజీవ్ సాగర్ ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీలో కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. 82 ఏండ్లల్లో హైదరాబాద్ సొసైటీ ఎన్నికల్లో మూడుసార్లు మాత్రమే ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నికైంది. సొసైటీని 1941లో స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించడం ఇది మూడోసారి. అధ్యక్షులుగా ఎంవి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా అనంతయ్య, సురభి అజిత, సంయుక్త కార్యదర్శులుగా కాంతారెడ్డి, గుర్రం మల్లేష్, కోశాధికారిగా నాగుల రాజేందర్ ఎన్నికయ్యారు. తమపై నమ్మకం, విశ్వాసం ఉంచినందుకు సభ్యులందరికీ అనంతయ్య ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

కెజిబివి ఉద్యోగులకు వేసవి సెలవులివ్వాలి

టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పన్నెండు నెలలు వేతనం ఇస్తున్నాం కాబట్టి వేసవి సెలవుల్లో కూడా రోజూ బడికి రావాల్సిందేనంటూ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హుకుం జారీచేయడం సబబు కాదని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ పాఠశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలనీ, సగం మంది బడిలో ఉండాలనీ, మిగిలిన సగం మంది ఊళ్లలో తిరిగి బాలికలను పాఠశాలలో చేర్పించటానికి క్యాంపైన్ చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్‌మెంట్ అని, ఆ డిపార్ట్‌మెంట్‌లోని కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా వేసవి సెలవులు వర్తిస్తాయని గుర్తు చేశారు. కెజిబివి ఉద్యోగులను వేసవి సెలవుల్లో కూడా పాఠశాలకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించటాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

'కంకి-కొడవలి' కొనసాగుతుంది

- కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ ఎన్నికల గుర్తుగా 'కంకి కొడవలి' కొనసాగుతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీకి రాష్ట్ర స్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. దేశంలో కేరళ, మణిపూర్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా ఆ నోటిఫికేషన్ ద్వారా తెలిపారని గుర్తుచేశారు. 2018 ఎన్నికల గుర్తులకు సంబంధించిన నియమనిబంధనల ప్రకారంగా రాష్ట్రంలో పార్టీకి ఉన్నటువంటి నిర్మాణం, ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకుని రాష్ట్రస్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్టుగా, స్థానిక సంస్థలతోపాటు, రాష్ట్రంలో పార్టీ ప్రాతిపదికగా జరిగే అన్ని ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ గుర్తు అయినటువంటి "కంకికొడవలి" యధాతథంగా కొనసాగిస్తున్నట్టుగా ఆ నోటిఫికేషన్ వెల్లడించిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి హోదానూ త్వరలోనే తిరిగి పొందగలిగే అవకాశాకాశాలు ఉన్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, అనుచరులు, ఓటర్లు మరింత విశ్వాసంతో పార్టీని పురోగమనం వైపు తీసుకెళ్లాలని కూనంనేని ఈ సందర్భంగా కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై టియుఎంఎంఎయు హర్షం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య శాఖలో 3 వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేశారనీ, ఇంకా అర్హత కలిగిన వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 15, 16 ఏండ్ల నుంచి పనిచేస్తున్న వాళ్లు ఉన్నారనీ, వారిని కూడా రెగ్యులర్ చేయాలని కోరారు.

కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- ఫైల్‌పై సంతకం చేసిన హోంమంత్రి మహమూద్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయ ప్రారంభోత్సవం రోజునే తన ఛాంబర్‌లో కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ఫైల్‌పై సంతకం చేశారు. అంతకముందు ఆయన మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో నూతన సచివాలయం మూడో అంతస్తులోని తన ఛాంబర్‌లో ఆసీనులయ్యారు. కొత్త ఛాంబర్ నుంచి తొలిరోజునే 40 కొత్త పోలీసు స్టేషన్లు, రెండు డిసిపి పోస్టుల ఏర్పాటుకు సంబంధించిన ఫైలుపై మంత్రి సంతకం చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్‌తో పాటు రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లలో ఈ 40 కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటు జరుగుతున్నది. హైదరాబాద్ నగరంలోనే సౌత్‌వెస్ట్, సౌత్‌ఈస్ట్‌ల పేరిట రెండు కొత్త డిసిపి జోన్ల ఏర్పాటు జరుగుతున్నది. ఈ సందర్భంగా హోం మంత్రి కొత్త సచివాలయంలో తన నూతన ఛాంబర్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్, డిజిపి అంజనీ కుమార్, ఎసిబి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి గుప్తా, నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు డి.ఎస్.చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర, టిఎస్ఎస్‌పి బెటాలియన్స్ అదనపు డిజి స్వాతి లక్రా, రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డిజి శిఖా గోయెల్, తదితర ఉన్నతాధికారులు హాజరై హోం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

18న రాష్ట్ర సదస్సు

- మే 22 నుంచి 31 వరకు ఇందిరాపార్క్ వద్ద రిలే దీక్షలు
- గ్రామీణ ఉపాధి సమస్యలపై దశలవారీ పోరాటాలు
- పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరించాలి
- గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరం చేస్తోందని, ఇలాంటి విధానాలను వెనక్కి తీసుకోవాలని గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. పట్టణ ప్రాంతాలకు ఉపాధిని విస్తరించాలని కోరింది. దశల వారీ ఆందోళన పోరాటాలను నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 18న రాష్ట్ర సదస్సు నిర్వహించాలని, మే 22 నుంచి 31 వరకు ఇందిరాపార్కు వద్ద రిలేదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు పి శంకర్, కార్యదర్శి పులి కల్పన, పీపుల్స్ మానిటర్ రింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి శివలింగం, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నరసింహ తదితరులు సమావేశమై, పలు నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామీణ ఉపాధి సమస్యలపై చర్చించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని గొంతు నులిపి చంపాలని చూస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే నిధులను భారీగా తగ్గించారనీ, ఉపాధి జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, మొబైల్ నెంబర్ లింకు పేరుతో కూలీల సంఖ్యను కుదించేందుకు సీరియస్ ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. ఉదయం ఏడు గంటలకు,



సాయంత్రం ఐదు గంటలకు పని ప్రదేశంలో కూలీలు ఫోటోలు దిగి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తేనే వేతనాలు ఇవ్వాలని సర్కులర్‌ను జారీ చేయడం సరైందికాదని పేర్కొన్నారు. ఇంటర్నెట్ సరిగా పనిచేయకపోయినా, సాఫ్ట్‌వేర్ టెక్నికల్ ప్రాబ్లమ్స్ వల్ల కూలీల ఫోటోలు అప్లోడ్ కొకపోయినా చేసిన పనికి వేతనాలు వేయకుండా నిలిపి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో ఫోటో దిగిందేందుకు ఎండలో ఎదురు చూస్తూ ఉండడం వల్ల వడదెబ్బ తగిలి అనేకమంది చనిపోయిన ఘటనలున్నాయని పేర్కొన్నారు. చనిపోయిన కూలీల కుటుంబాలను ఆదుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదని గుర్తు చేశారు. అనేక కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి అనాధలుగా మారుతున్నాయని వివరించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న వేతనాలు చెల్లింపు, పని చూపించే పద్ధతులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి లాక్కున్నదని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంటు, త్రాగునీరు, అత్యవసర మందులు వంటివి చట్టప్రకారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలేదనీ, అయినా ఎక్కడా అవి కనిపించడం లేదని తెలిపారు. పట్టణీకరణ పేరుతో గ్రామాలను పట్టణ ప్రాంతాల్లో కలపడం వల్ల ఇప్పటివరకు కొనసాగిన గ్రామీణ ఉపాధి హామీ పనిని తొలగిస్తున్నారని వివరించారు. దీంతో ఆ ప్రాంతాల్లో పేదలు ఉపాధి కోల్పోతున్నారని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీశ్రీ సాహిత్యానికి మరణం లేదు

- ఆయన సాహిత్యంపై అధ్యయనం పెరగాలి
- 'శ్రామిక కవి సమ్మేళనం'లో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

శ్రమనుంచే సాహిత్యం, సంగీతం, నాట్యం ఆవిర్భవిస్తాయనే వాస్తవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) ఎప్పటికీ చిరంజీవే అనీ, ఆయన సాహిత్యానికి మరణం లేదని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఎస్‌వి సత్యనారాయణ అన్నారు. తెలంగాణ సాహితి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ జయంతి, మేడే సందర్భంగా 'శ్రామిక కవి సమ్మేళనం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌వి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాకవి శ్రీశ్రీ ఆధునిక సాహిత్యాన్ని భూమార్గం పట్టించి, భూకంపం సృష్టించారని చెప్పారు. అప్పటి వరకు భావుకతలో కొట్టుకుపోతున్న కవిత్వాన్ని అభ్యుదయ, విప్లవ మార్గం పట్టించి, సాహిత్యంలో సామాన్యుడికి చోటు కల్పించారని కొనియాడారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాలు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయనీ, సెజ్‌ల పేరుతో పనిని 12 గంటలు తప్పనిసరి చేస్తూ, శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'అడ్డంగా రాస్తే వ్యాసం... నిలువుగా రాస్తే కవిత్వం' కాదనీ, కలకాలం జనం నాలుకలపై నాట్యం చేస్తూ, సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ తట్టిలేపే రచనలు రావాలని చెప్పారు. మార్క్సిజం, లెనినిజం దార్శనికతతో కవిత్వం గోడలపై నినాదంగా మారాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ



ప్రపంచంలో వర్గ దృష్టి, పేద, ధనిక తారతమ్యం ఉన్నన్నాళ్లు శ్రీశ్రీ జీవించే ఉంటాడని అన్నారు. కార్యక్రమానికి తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత కందిమళ్ల ప్రతాపరెడ్డి, అభ్యుదయ పాటల రచయిత బండి సత్తన్నను సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం ఎందర్నో ప్రభావితం చేసిందనీ, బాధ నుంచి పుట్టే కవిత్వం శాశ్వతమవుతుందని అన్నారు. ప్రముఖ రచయిత తంగిరాల చక్రవర్తి ఆహూతులను వేదికపైకి ఆహ్వానించగా, శరత్ సుదర్శి వందన సమర్పణ చేశారు. అంతకుముందు కేవీఎల్, సలీమ 'శ్రామిక కవి సమ్మేళనం' నిర్వహించారు. పలువురు కవులు తమ కవితల్ని చదివి వినిపించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ మోహనకృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు రండి

- మంత్రి గంగుల కమలాకర్‌కు పొన్నం సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మొత్తం ఎంత ధాన్యం కొన్నారు? మీరు చెబుతున్నది ఎంత? దీనిపై బహిరంగ చర్చకు వస్తారా? అంటూ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ మంత్రి గంగుల కమలాకర్‌కు సవాల్ విసిరారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి మంత్రి అవాస్తవాలు చెబుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో మంత్రి చెబుతున్న అవాస్తవమని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25వేల పరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ ముసుగులో నిరుద్యోగులకు కుచ్చుటోపి

- జిల్లా రుణం తీర్చుకునే అవకాశం ఇవ్వండి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు : రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంతోపాటు తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టి రాజ్యాంగం సాక్షిగా 30 లక్షల నిరుద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కుచ్చుటోపి పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆరోపించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని గడియారం చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన నిరుద్యోగ నిరసన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు మెట్టుగడ్డ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కెసిఆర్ వలస వచ్చి పాలమూరు జిల్లాలో పార్లమెంట్ సభ్యుడైనా ఈ జిల్లాకు నీళ్లు ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఎత్తిపోతల పథకాలు తప్ప ఎనిమిదేండ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ 80 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయంటే టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఉద్యోగాల పట్ల ఎంత ఆసక్తి ఉందో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోరాటాన్ని నడిపించింది ఒక్క కాంగ్రెస్ పార్టీ తప్ప కెసిఆర్ ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. మొట్టమొదటి సారిగా చిన్నారెడ్డి నాయకత్వంలో తెలంగాణ సభ వనపర్తి జిల్లాలో జరిగిన దృశ్యాన్ని చూసిన కెసిఆర్ 2001లో టిఆర్ఎస్ పార్టీ పెట్టి రాజకీయ దోపిడీకి తెరలేపారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బూర్గుల రామకృష్ణారావు తర్వాత తిరిగి 80 ఏండ్లకు ఈ ప్రాంతవాసినయిన తనకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా అవకాశం లభించిందన్నారు. ఈ జిల్లాలో 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరితే మళ్లీ మనకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వస్తుందని తెలిపారు.

నిరుద్యోగులు ఎవరు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యేలు చిన్నారెడ్డి, నాగం జనార్ధన్ రెడ్డి, సంపత్ కుమార్, మల్లురవి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు జై మధుసూదన్ రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు వి హనుమంతరావు, తదితరులు ప్రసంగించారు.



కళల అభ్యాసానికి దృష్టి , మనస్సు ఐక్యం కావాలి

ప్రజాశక్తి - కల్చరల్

ఏ కళా ప్రక్రియ అభ్యసించాలన్న దృష్టి మనస్సు రెండూ ఏకం కావాలని ప్రముఖులు సూచించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా ఎనిమిది ఘంటాలు నాట్యమహోత్సవం జరిగింది. వైష్ణవి నాట్య లయ గురువు జ్యోతిర్మయి, మయూరి నృత్యాలయ్ గురువు రాజనాల శ్రీదేవి, రమాదేవి డాన్స్ అకాడమీ గురువు రమా దేవి, తాండవ క్రిష్ణ నృత్యాలయ్ గురువు ఉదయ శ్రీ, గురువు ప్రియాంక శిష్య బృందం అన్నమయ్య త్యాగరాజ, రామదాసు దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కీర్తనలను నర్తించి ఆకట్టుకున్నారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పోలీస్ ఉన్నతాధికారి రామ దాసు, ప్రముఖ నాట్య గురువు పసుమర్థి శేషుబాబు లు నర్తకులను అభినందించి గురువులను సత్కరించారు. రామ దాసుమాట్లాడుతూ కళలు సంస్కారం నేర్పుతాయన్నారు. శేషు బాబు మాట్లాడుతూ పంచమ వేదం నాట్యం ప్రామాణిక శాస్త్రం నాట్య శాస్త్రమని తెలిపారు. నాట్య గురువు ఉదయ శ్రీ మాట్లాడుతూ పాఠ్య గ్రంధాలలో నేడు నీతి శాస్త్రం వంటిగ్రంధాలు లేవని అందుచే కళల అవసరం అన్నారు. పెద్దలు ఉద్యోగాలలో పని గంటలు గురించి పోరాటాలు చేస్తారని కానీ పిల్లలను మాత్రం పన్నెండు ఘంటలు చదువులో నిలుపుతున్నారని వారికి కళలు ఒత్తిడి ని తగ్గిస్తాయని చెప్పారు. నిర్వాహకులు రాం కుమార్ స్వాగతం పలుకగా రాజనాల శ్రీదేవి వందన సమర్పణ చేశారు.

వివాహితపై సామూహిక లైంగిక దాడి

- పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్, మరో ఇద్దరు యువకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


హనుమకొండ జిల్లాలో శనివారం అర్ధరాత్రి ఓ వివాహితను ఇద్దరు యువకులు ఆటోలో కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. హనుమకొండ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని రాంనగర్‌కు చెందిన ఓ వివాహిత(40) కిషన్‌పురలోని ఓ కర్రీ పాయింట్‌లో కుకింగ్ మాస్టర్‌గా పనిచేస్తోంది. భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా శుక్రవారం రాత్రి భర్తతో గొడవపడి రాత్రి సుమారు 12 గంటల సమయంలో తాను పనిచేస్తున్న కర్రీ పాయింట్ వద్దకు వచ్చి పడుకోవాలనుకుంది. ఇంతలోనే ఒక టీ స్టాల్‌లో పనిచేసే సతీష్ అనే యువకుడు ఒంటరిగా ఉన్న ఆమెను గమనించాడు. దురాలోచనతో విషయాన్ని బీమారానికి చెందిన రాజేష్ (ఆటో డ్రైవర్)కు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే రాకేష్ తనతోపాటు సనత్ అనే యువకుడిని వెంటబెట్టుకుని నయీం నగర్‌కు ఆటోలో చేరుకున్నారు. అప్పటికే వారు మద్యం మత్తులో ఉండటంతో ఒంటరిగా ఉన్న మహిళను ఆటోలో బలవంతంగా ఎక్కించుకొని సమీపంలో ఉన్న బీమారంలోని తాటి వనంలోకి తీసుకెళ్లారు. తనను ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ ఆమె అరవడం ప్రారంభించింది. దాంతో వారు అరవొద్దంటూ బెదిరించారు. బీమారం గ్రామ శివారులోకి వెళ్లిన తర్వాత ఆటో సౌండ్ బాక్స్ శబ్దం బాగా పెంచి ఆమెపై వారు లైంగికదాడికి పాల్పడ్డారు. ఆమె సొమ్మసిల్లి పడిపోవడంతో తెల్లవారుజామున సుమారు ఐదు గంటల వరకు ఆమెను తమతో ఉంచుకొని తిరిగి కిషన్ పురలోని కర్రీ పాయింట్ వద్ద ఆమెను దింపి వెళ్లిపోయారు. జరిగిన విషయాన్ని ఆమె తన భర్తకు చెప్పడంతో వెంటనే వారు హన్మకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు.. సిసి కెమెరాల సహాయంతో నిందితులు రాజేష్, సనత్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ చెప్పారు.

దళిత బంధులో అవినీతి ఎమ్మెల్యేల చిట్టా వెల్లడించాలి

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత బంధు పథకంలో లబ్ధిదారుల నుంచి రూ. మూడు లక్షల వరకు తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టాను సిఎం కెసిఆర్ వెల్లడించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహం ముందు ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'తెలంగాణలో అవినీతిలేని పాలనను అందిస్తామని, కన్న కొడుకు తప్పు చేసినా సహించేది లేదని' మాట్లాడిన కెసిఆర్.. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళితుల నుంచి రూ. మూడు లక్షలు లంచం తీసుకుంటుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అవినీతి ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందంటూ మాట్లాడుతున్న సిఎం.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సిహెచ్ సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు విఎస్ రాజు మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు జెపి లత మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలి

- కెసిఆర్ పాలనలో జవాబుదారీతనం లోపించింది
- సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క
- జనగామ, ఆలేరులో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని, బడుగు, బలహీన వర్గాల మైనార్టీ ఆశలు చిగురించాలని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జనగామ జిల్లా మండలం పెంబర్తి, యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శ్రీనివాసపురం, పటేల్ గూడెం, గుండ్ల గూడెం, శివలాల్ తండా గ్రామాల్లో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కొనసాగింది. పాదయాత్ర ముందు డోలు కళాకారులు, పోతురాజుల విన్యాసాలు, గిరిజనుల నృత్య ప్రదర్శనలు చేశారు. మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. పటేల్ గూడెం గ్రామ సమీపంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. కెసిఆర్ పాలనలో అధికారుల్లో జవాబుదారీతనం లోపించిందని, ఎవరి ఇష్టమొచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం ఎప్పుడో అటకెక్కిందన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం అవుతుందని చెప్పి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు.. శిలా విగ్రహాలుగా మారాయన్నారు. రోజురోజుకు కురుస్తున్న భారీ వర్షాలతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దవుతుందని, అయినా ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పటేల్ గూడెం గ్రామానికి చెందిన రైతు కొండ రాఘవరెడ్డి వరి ధాన్యం పరిశీలించి తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల బాధలు తీర్చాల్సిన స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతే రాజుగా ఉండేవారని, తెలంగాణ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక దళారులను ప్రోత్సహిస్తూ తక్కువ ధరకే విక్రయించేలా చూస్తున్నారని ఆరోపించారు. ఆలేరు నుండి జనగాం వెళ్లే పాత హైవే రోడ్డు గుంతల మయంగా మారిందన్నారు. పది వేల జనాభా ఉన్న ప్రజలు నిత్యం ఆలేరుకు ప్రయాణం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, నియోజకవర్గ నాయకులు కల్లూరి రామచంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వడ్లు ఎత్తట్లేదు..!

- కాంటాలు వేసినా.. రవాణా కావట్లే..
- రోజుల తరబడి ఎదురుచూసినా లారీలు రావట్లే..!
- మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు
- అకాల వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులవుతున్నా కొనుగోళ్లు మాత్రం ఊపందుకోవడం లేదు. ఓవైపు అకాల వర్షాలు వెంటాడుతుండటంతో రైతుల్లో ఆందోళన అలుముకుంటోంది. రాశుల కొద్దీ ధాన్యం కేంద్రాల్లో ఉన్నా కొనుగోళ్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు చేసిన వడ్లను సైతం వెంటనే తరలించే పరిస్థితి లేదు. ధాన్యం కేంద్రానికి తెచ్చినప్పటి నుంచి మిల్లులకు చేర్చే వరకు రైతులదే బాధ్యత అనే నిబంధన ఉంది. ఈ ప్రక్రియలో ఏ కొద్ది జాప్యం జరిగినా ఆరుగాలం కష్టం వర్షం పాలయ్యే అవకాశం ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని సైతం లారీలు లేక తరలించడం లేదు. ఈ క్రమంలో చాలా చోట్ల ధాన్యం రాశులు తడిసి వడ్లు నీటిలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు ఆందోళన చేస్తున్నారు.

మందకొడిగా కొనుగోళ్లు.. రవాణా

రాష్ట్రవ్యాప్తంగా 7,100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మిల్లుల్లో భారీగా నిల్వలు ఉండటంతో మిల్లర్లు సకాలంలో దిగుమతికి సహకరించట్లేదు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలు ఇలా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఓవైపు అదనపు కలెక్టర్లు ట్రేడర్లు, మిల్లర్లు, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నా ఎలాంటి పురోగతీ కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 200 కేంద్రాలు ప్రారంభించారు. వీటిలో సుమారు 1100 మంది రైతుల నుంచి 15వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేశారు. పదివేల లోపు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు చేర్చారు. ఇంకా మూడు నుంచి ఐదువేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం కేంద్రాల్లో నిల్వ ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. కానీ ఇంకా అధికమొత్తంలోనే నిల్వ ఉండే అవకాశం ఉంది. రవాణాకోసం ఐదువేలు, కొనుగోళ్ల కోసం మరో ఐదువేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండటం.. కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటాన్ని సూచిస్తోంది.

ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఐదువేలకు పైగా బస్తాఉ

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఐదువేలకు పైగా బస్తాలు కొనుగోళ్ల కోసం ఉన్నాయి. వరి అధికంగా పండించే ప్రాంతాల్లోనైతే పదివేలకు పైగా బస్తాలు నిల్వ ఉన్నాయి. కూసుమంచి మండలం పాలేరు ఐకేపీ కేంద్రంలోనైతే పదివేల బస్తాలు మూడురోజులుగా కొనుగోళ్లు లేకుండా ఉంటున్నాయి. ఈ కేంద్రాన్ని ఈనెల 16వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. 22వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు రెండువేల బస్తాలను మాత్రమే కొన్నారు. కోతలు దాదాపు పూర్తవడంతో భారీ మొత్తంలో ధాన్యం కేంద్రానికి వస్తోంది. కానీ రవాణా లేకపోవడంతో కొనుగోళ్లు ముందుకు కదలట్లేదు. ఇప్పటికీ మూడు రోజులుగా ఈ కేంద్రం నుంచి ఒక్క గింజను కూడా రవాణా చేయలేదు.

మిల్లుల వద్ద నిరీక్షణ...'లారీల' నిరాకరణ

ధాన్యం లోడుతో వెళ్లిన లారీలు దిగుమతులు లేక రోజుల తరబడి మిల్లుల వద్ద నిరీక్షించాల్సి వస్తుంటంతో



యజమానులు వడ్లకు వాహనాన్ని పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. ఓ వైపు రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నారు. వారు పై అధికారులకు ఈ విషయాన్ని చేరవేసినా.. వారు మిల్లర్లతో మాట్లాడుతున్నా ఫలితం ఉండటం లేదు. ప్రజాప్రతినిధులకు సైతం మొరపెట్టుకున్నా ఉపయోగం లేకుండా పోతోందని రైతాంగం వాపోతోంది. ఈ విషయమై పలుచోట్ల రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరికి ఆయా పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. 15 రోజుల్లో పాలేరు కేంద్రం నుంచి నాలుగు లోడ్‌లు ఎత్తారు. ఐదురోజులుగా లారీలు తిరిగి రావట్లేదని రైతులంటున్నారు. ఈ కేంద్రం నుంచి కూసుమంచి, నర్సింహులగూడెం మిల్లులకు లారీలు వెళ్లాయి. దిగుమతి లేకపోవడంతో ఖమ్మం తరలిస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం గమన్హాం.

తూకం వేసినా అక్కడే..
బీరెల్లి సుధాకర్, మల్లాయిగూడెం, కూసుమంచి

మొత్తం 12 ఎకరాల వరి సాగు చేశా. కోతలు కోసి నెలరోజులైంది. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదురోజుల కిందట వడ్లు కంటా పెట్టారు. లారీలు రావట్లేదని.. వాటిని రవాణా చేయట్లేదు. ధాన్యం మిల్లుకు చేరే వరకు రైతుదే బాధ్యతనే నిబంధన ఉండటంతో ఇక్కడే ఉండాల్సి వస్తోంది. ఎప్పుడు అకాల వర్షం వస్తదో.. యాడ ఆగమైతనోనని ఆందోళనగా ఉంది. అమ్మినంక కూడా ఆవేదన తప్పేటట్టు లేదు. రవాణా సాగట్లేదని ఎమ్మెల్యేకు ఫోన్ చేశా. ఆయన నేను మాట్లాడతా అన్నారు. ఏమైందోగానీ ఐదు రోజుల నుంచి నా వడ్లు మాత్రం కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. ఒకటి గాదు.. రెండుగాదు 350 బస్తాలు కేంద్రంలో ఉన్నాయి. అకాలవర్షం వస్తే నేను, నా భార్య ఏమి చేయగలుగుతాం. ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు
బొంతు రాంబాబు, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

రైతులను ఇబ్బంది పెట్టకుండా ఎప్పటి ధాన్యం అప్పుడు రవాణా చేయాలి. కొనుగోళ్లు వెనువెంటనే చేస్తుండాలి. ఓవైపు అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం కష్టం ఎక్కడ వర్షార్పణం అవుతుందేమోనన్న రైతుల్లో ఉంటుంది. కాబట్టి కొనుగోళ్లు, రవాణా, దిగుమతి ఇవన్నీ సకాలంలో జరగాలని తెలంగాణ రైతుసంఘం తరఫున డిమాండ్ చేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.

లారీల నుంచి వెంటనే దిగుమతి చేసుకోవాలి
ఎన్ మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

లారీల నుంచి వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. రవాణా పరంగా జాప్యం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు చేపడుతున్నాం.